ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 44.0
కనిష్ఠం : 26.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:27 (సోమ)
సహరి : 4:31 (మంగళ)



చికెన్‌కు వడదెబ్బ

కిలో రూ.280 నుంచి రూ.300

చికెన్ ధరలు ఆకాశాన్నంటాయి. ఎండలు మండుతున్న వేళ చికెన్ ఉత్పత్తులపై ప్రభావం పడింది. దీంతో ధరలు అమాంతం పెరిగాయి. ఆదివారం వేళ చికెన్ ప్రియులకు ఈ ధరలు చుక్కలు చూపించాయి. గత వారం రూ.220 పలికిన ధరలు ఈ వారం రూ.80 పెరిగింది. కిలో రూ. 300 వరకు విక్రయించారు. ఇదిలా ఉంటే రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున కోళ్లు చనిపోతాయని, ఉత్పత్తి లేకపోవడంతో ధరలు ఇంకా పెరుగుతాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

- తాడేపల్లిగూడెం రూరల్

సన్‌డే

ఆదివారం ఎండ మండింది.. సూరీడు నిప్పులు చెరిగాడు. ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆదివారం 44 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉక్కపోతతో జనం అల్లాడారు.. బయటకు రావాలంటే భయపడిపోయారు. దీంతో రహదారులు నిర్మానుషంగా మారాయి.



ఎండ నుంచి ఉపశమనం కోసం ద్వారకాతిరుమలలో పశువులకు జల్లు స్నానం చేయిస్తున్న సిబ్బంది

5

18 నుంచి నామినేషన్లు ప్రారంభం : కలెక్టర్



భీమవరం టౌన్, ఏప్రిల్ 7 : సాధారణ ఎన్నికల నామి నేషన్ల ప్రక్రియ ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభ మవుతుందని, నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం వెల్లడించారు. సాధారణ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈనెల 18 నుంచి ప్రారంభమై 25 తేదీతో ముగుస్తుందన్నారు. 26న నామినేషన్ పత్రాల పరిశీలన నామినేషన్ పత్రాల ఉపసంహరణ ప్రక్రియ 29న ముగుస్తుందన్నారు. మే13న ఎన్నికలు జరుగు తాయని తెలిపారు. 1,463 పోలింగ్ కేంద్రాలలో తాగు నీరు, ర్యాంప్, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు 120 శాతం ఈవీఎం యంత్రాలు సిద్ధంగా ఉంచామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని వాటి వద్ద వెబ్ క్యాస్టింగ్, అబ్జర్వర్ల నిఘా ఉంచామన్నారు. సర్వీస్ ఓటర్లు, విధుల్లో ఉండే ఉద్యోగులు నామినేషన్ సమయంలో అభ్యర్థులకు మూడు వాహనాలకే అనుమతి ఉంటుందని అభ్యర్థులతో పాటు మరో నలుగురు మాత్రమే లోపలికి వెళ్లడానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక్కొక్క అభ్యర్థి నాలుగు నామినేషన్ పత్రాలు వేయడానికి అవకాశం ఉందన్నారు. అఫిడవిట్, ఓటు ధ్రువీకరణ పత్రం, పార్టీ బలపరిస్తే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ ఖాతాలు నామినేషన్‌తో పాటు ఇవ్వాల్సి ఉందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలు చేయడానికి ప్రతి మండలానికి టీంలు ఏర్పాటు చేశామన్నారు.

పెన్షన్ రోజుల్లో.. ఫుల్ జోష్



గడిచిన రెండు రోజుల్లో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి.. సరాసరిన 20 శాతం అదనంగా అమ్మకాలు సాగాయి. దీంతో ఎన్నికల సంఘం ఆరా తీయడం ప్రారం భించింది.. ఎన్నికల వేళ ఏమైనా పక్కదారి పట్టిస్తున్నారా అనే దానిపై దృష్టి పెట్టింది. అయితే ఎక్సైజ్ అధికారులు చెప్పిన సమాధానంతో ఎన్నికల అధికారులు విస్తుపోతున్నారు .. ఎందుకో ఏమిటో తెలియాలంటే ఇది చదవండి..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వృద్ధులకు ప్రభుత్వం పెన్షన్ ఇవ్వడం తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీ రామారావు హయాంలో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచీ టీడీపీ పెన్షన్ పెంచుకుంటూ వచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలో రూ. 3 వేలు చేశారు. దానిని రూ. 4 వేలు చేసి ఇంటికే పంపిణీ చేస్తామంటూ తెలుగుదేశం ప్రకటించింది. ఏప్రిల్ నెల నుంచే పెంచిన పెన్షన్ అంద జేస్తామని స్పష్టం చేసింది. అంటే జూలై నెలలో ఒకేసారి వృద్ధులకు రూ. 7000 పెన్షన్ లభిస్తుంది. ఇది వృద్ధులతో పాటు ఎక్సైజ్ శాఖకు ఎంతగానో ప్రయోజనకరం.. ఎందు కంటే వృద్ధులు పెన్షన్ అందుకున్న రోజు మద్యం అమ్మకాలు 20 శాతం పెరుగుతాయట. మద్యం అమ్మకాలు ఎందుకు పెరిగాయంటూ ఎన్నికల సంఘం ప్రశ్నిస్తే ఎక్సైజ్ అధికారులు ఇచ్చిన సమాధానం. ఇందులో నిజమెంతో తెలియదు గానీ పెన్షన్ ఇచ్చిన తర్వాత రెండు రోజులు మద్యం విక్రయాల్లో మాత్రం పెరుగుల కనిపించిందని లెక్కలు చెబుతున్నాయి. మద్యం విక్రయాలు అధికమైతే అభ్యర్థులు పక్కదారి పట్టిస్తున్నారనేది ఎన్నికల సంఘం ఉద్దేశం. అందుకే అమ్మ కాలు పెరిగిన షాపుల నుంచి వివరణ కోరుతోంది.

20 శాతం అదనం



ప్రభుత్వం వృద్ధులకు పెన్షన్ పంపిణీ చేసిన రోజు 20 శాతం అమ్మకాలు పెరుగుతున్నాయి. ఇది ఈ ఒక్క నెలే కాదు. పెన్షన్ అందుకున్న రోజున ప్రతినెలా ఇలాగే ఉంటుందని అధికారులు చెపుతున్నారు. వృద్ధులు ఒకేసారి మూడు బాటిళ్ల వరకు కొనుగోలు చేస్తారని అందుకే ఆరోజు అమ్మకాలు పెరుగుతుంటాయని సెల విస్తు న్నారు. ప్రతి రోజు సగటున జిల్లాలో రూ.2.10 కోట్లు మద్యం అమ్మకాలు జరుగు తున్నాయి. కానీ పెన్షన్ ఇచ్చిన రెండు రోజుల పాటు 2.40 కోట్లు పైనే అమ్మకాలు జరుగుతాయని చెబుతున్నారు.

ఎందుకు పెరిగింది..?

వాస్తవానికి జిల్లాలో అమ్మకాలు తక్కువగా ఉన్నాయని ప్రభుత్వం గగ్గోలు పెడుతూ వచ్చింది. ఆక్వా రంగం దెబ్బతినడం. నిర్మాణ రంగం కుదేలు కావడం, వరి సాగు సక్రమంగా లేకపో వడంతో ఆ ప్రభావం మద్యం విక్రయాలపై పడుతున్నాయని అధికారులు వివరణ ఇస్తూ వచ్చారు. ప్రతిఏటా మద్యం అమ్మకాలు పది నుంచి 15 శాతం పెరగాలి. పశ్చిమగోదావరి జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. పెరుగుదల లేకుండా పోయింది. ప్రతి రోజు సగటున జిల్లాలో రూ. 2.10 కోట్లు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాలు, ప్రైవేటు

- రెండు రోజులుగా పెరిగిన మద్యం అమ్మకాలు
- ఎందుకు పెరిగాయంటూ ఎన్నికల సంఘం ఆరా
- పెన్షన్ పంపిణీ వల్లే అంటున్న ఎక్సైజ్ అధికారులు
- ప్రతినెలా ఇలాగే పెరుగుతుందంటూ వివరణ
- విస్తుబోయిన ఎన్నికల సంఘం..

బార్‌లలో అమ్మకాలు ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. దాంతో ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోలేక పోతున్నారు. ఇప్పటివరకు అమ్మకాలు పెరగడం లేదని ప్రభుత్వం ఒత్తిడి పెంచుతూ వచ్చింది. ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత సీన్ రివర్స్ అయ్యింది. అమ్మకాల్లో కాస్త పెరుగుదల కనిపించినా సరే ఎన్నికల సంఘానికి వివరణ ఇవాల్సి వస్తోంది. తాజాగా పెన్షన్ పంపిణీ చేసిన రోజున ప్రతిషాపులోనూ అమ్మకాలు పెరిగాయి. ఆ రోజు 20 శాతం అధిక ఆదాయం లభించింది. దీనిపై ఇప్పుడు ఎన్నికల సంఘం దృష్టి పెట్టింది. పెన్షన్ పేరుతో మద్యం పక్కదారి పట్టించారా...లేదా నిజంగా అమ్మకాలు జరిగాయా....పెన్షన్ లబ్దిదారులు కొనుగోలు చేశారా ? అనే విషయంపై ఆరా తీస్తున్నారు. సిబ్బంది మాత్రం పెన్షన్ పొందిన వృద్ధులు కొనుగోలు చేయడం వల్లే అమ్మకాలు పెరిగాయని చెపుతున్నారు.ప్రభుత్వం వృద్ధుల కోసం ఇస్తున్న పెన్షన్‌లోనూ కొంత మొత్తం మద్యానికి వెళుతుందా అంటూ ఎన్నికల సంఘం ఇప్పుడు విస్తుపోతోంది.

బార్‌లపై నిఘా ఏదీ ?

బార్‌లలో అమ్మకాలు పెరిగాయి. బ్రాండెడ్ రకాలు లభిస్తుండడంతో విక్రయాలు అధికంగానే ఉంటాయి. ఎన్నికల సమయంలో అవి మరికాస్త పెరిగాయి. అధికారుల దృష్టి బార్‌లపై ఉండడం లేదు. మరోవైపు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే కొందరు అభ్యర్థులు సొమ్ములు ఇస్తున్నారు. ప్రతి కార్యకర్తకు కనీసం రూ. 1000 లభిస్తోంది. దాంతో మద్యం అమ్మకాలు పెరుగుతున్నాయి.వాస్తవానికి క్వార్టర్ బాటిళ్లు బార్‌లలో అమ్మడానికి వీలులేదు. కానీ అవికూడా వైసీపీ ప్రభుత్వంలో విక్రయాలు సాగిస్తున్నారు. ఆర్థికంగా సంపన్నమైన పట్టణంలో ఒకే రోజు పెద్దమొత్తంలో బార్‌ల నుంచి మద్యం పక్కదారి పట్టింది. దాదాపు 1500 కేసులు ఐదు బార్‌ల నుంచి అధికార పార్టీ నేత తీసుకు పోయారు. ఎన్నికల కోసమని భద్ర పరుచుకున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాతే వీటి అమ్మకాలు సాగాయి. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గతంలో అధికార పార్టీ ఆశీస్సులతోనే బార్ యజమానులు సిండికేట్ అయి షాప్‌లు దక్కించుకున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దానికోసం తమ వంతు సహకారం ఉందంటూ పోటీలో ఉన్న అధికార పార్టీ నేతలు బార్‌లపై పడుతున్నారు. తమకు అవసరమైన మద్యాన్ని తీసుకుంటున్నారు. ఇలా బార్‌లలో అధిక విక్రయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ మద్యం షాపుల్లో మాత్రం విక్రయాలు పెరిగితే అధికారులు ఆరా తీస్తున్నారు. అదే బార్‌లలో పెరిగినా సరే ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది.

రేషన్‌లో కోత



ఏలూరు రూరల్, ఏప్రిల్ 7: కార్డుదారులకు రేషన్ కోత విధిస్తున్నారు. ఏప్రిల్ లోనే ఈ విధానం అమలు చేస్తుండటంతో కార్డుదారులు ఆందోళన చెందు తున్నారు. వాస్తవంగా ప్రతినెల రేషన్ కార్డుదారులకు నిత్యావసర సరుకుల కింద బియ్యంతో పాటు పంచదార అందజేస్తున్నారు. ఒక్కోనెల బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమ పిండిని పంపిణీ చేసేవారు. ఈనెల కోటాలో పంచదార ఒకటే సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి రేషన్ కార్డులో ఉన్న ఒక్కో సభ్యుడికి ఐదు కిలోల బియ్యంతో పంచదార, కంది పప్పు ఇవ్వాల్సి ఉంది. కందిపప్పు ఇవ్వకపోవడంపై కార్డుదారులు మండి పడుతున్నారు. గత టీడీపీ హయాంలో ఈ పరిస్థితి లేదని, నిత్యావసర సరుకుల్లో కోత విధించడం ఏమి టని కార్డుదారులు ప్రశ్ని స్తున్నారు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మూడు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఒక్కో నెల ఒక్కో విధంగా ఇస్తుండడం పట్ల కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భక్తుడిలా వచ్చి అమ్మవారి.. మంగళ సూత్రం కొట్టేశాడు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 : ఏలూరు సమీపంలోని సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఒక వ్యక్తి భక్తుడిగా వచ్చి దండం పెట్టుకున్నాడు. ఆ పై అటు ఇటు చూసి అమ్మవారి మెడలో ఉన్న ఏడు కాసుల బంగారు మంగళసూత్రాన్ని అపహరించుకుపోయాడు. ఆ గుడి పూజారి తూటుకూరి నాగేశ్వరశర్మ ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. దర్యాప్తు నిమిత్తం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దొంగను ప్రాథమికంగా గుర్తించారు. అతనిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



అమ్మవారి మంగళసూత్రాన్ని అపహరించుకుపోతున్న దొంగ

ప్రశ్నార్థకంగా చేపల సాగు..!



కలిదిండి, ఏప్రిల్ 6 : ఉప్పుటేరులోకి ముందస్తుగా ఉప్పునీరు రావడంతో కొండంగి లాకుల వద్ద ఉప్పుటేరుపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాల ద్వారా నీటి సరఫరా నిలుపుదల చేశారు. దీంతో చేపల సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలో 36 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 23 వేల ఎకరాల్లో చేపల సాగు, 10 వేల ఎకరాల్లో రొయ్యల సాగు, 3 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ప్రధానంగా ఉప్పుటేరుపైనే ఆధారపడి చేపల సాగు చేస్తున్నారు. గతంలో మే నెల వరకు ఉప్పునీరు వచ్చేది కాదు. ఈ ఏడాది దాళ్వా పంట లేకపోవడంతో కాల్వలను కట్టేయడంతో తీపి నీరు దిగక ఏప్రిల్ మొదటి వారంలోనే ముందస్తుగా ఉప్పునీరు వచ్చింది.తీపి నీటిలో మాత్రమే తెల్ల చేపలు పెరుగుతాయి. ఉప్పునీరు తోడితే చెరువుల్లో చేపలకు కళ్లు మండి చనిపోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడితో చేపల సాగు చేస్తున్న రైతులు చిన్న చేపలనే పట్టుబడి చేసి అయినకాడికి అమ్ముకుని నష్టాల పాలవుతున్నారు. కొంతమంది రైతులు చెరువులకు నీరు పెట్టకుండా ఖాళీగానే ఉంచుతున్నారు.



సోమేశ్వరునికి భస్మాభిషేకం

భీమవరంటౌన్, ఏప్రిల్ 7 : పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వర జనార్దనస్వామికి శోభకృత నామ సంవత్సం చివరి మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం భస్మాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వేదోక్తంగా భస్మాభిషేకం చేసి అలంకరించారు.ఈవో రామ కృష్ణంరాజు పర్యవేక్షించారు.

రొయ్య రైతు విలవిల!



- దిగుబడులున్నా గిట్టుబాటు కాని వైనం
- 100 కౌంట్ పట్టినా రైతుకు నష్టమే
- రొయ్య ధరలపై పట్టని ప్రభుత్వం
- కొనుగోలుదారులదే రాజ్యం

నిడమర్రు ఏప్రిల్ 7 : ఆరుగాలం ఇల్లూవాకిలి వదిలి చెరువులు చుట్టూ తిరిగి పంట పండించిన రైతుకు నష్టమే మిగులుతోంది. గిట్టుబాటు ధరలేక నష్టాలతోనే సరుకు అమ్ముకుంటున్నాడు. ధరలు తగ్గించి పెట్టుబడి ఖర్చులు కూడా రాకుండా చేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా రొయ్య పంటకు సరైన సమయం జనవరి పంట. సంక్రాంతి పండుగ తర్వాత వాతావరణంలో మంచు శాతం తగ్గి పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఈ వాతావరణం రొయ్య అనుకూలం కాబట్టి రొయ్య పంటను ఎక్కువగా వేస్తారు. వేసవి పంటలో రొయ్యల్లో ఎదుగుదల బాగా ఉంటుందని రైతులు భావిస్తుంటారు. ఎండ, ఉక్కపోతలను లెక్కచేయక పంట పండించినా చివరకు అమ్మే సమయంలో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో 100 కౌంట్ రూ.205, 90 కౌంట్ రూ.215, 80 కౌంట్ రూ.225, 70 కౌంట్ రూ.245, 60 కౌంట్ రూ.265, 50 కౌంట్ రూ.290 ధరలు పలుకుతున్నాయి.

మేత ధరలు చుక్కల్లో..

గత ఏడాదిగా రొయ్య సాగులో ప్రధాన పెట్టుబడి సరుకైన మేత ధరలు

మేత ధర పైపైకి రొయ్య ధర కిందకి..

పెరుగుతూ వస్తున్నాయి. గత సంవత్సరం టన్ను రొయ్య మేత ధర రూ.65 వేలు నుంచి రూ.75 వేలు ఉండగా నేడు రూ.90 వేల నుంచి రూ.95 వేలకు పెరగడంతో రైతులపై తీవ్ర భారం పడింది. టన్నుకు అదనంగా రూ.20 వేలు అదనపు భారం భరించాల్సి వస్తోంది. ఒకప్పుడు రొయ్య మేత షాపుల వాళ్లు అరువులు ఇచ్చి పంట పండాక జమ చేసే అవకాశం కల్పించేవారు. కాని నేడు ఆక్వా పరిశ్రమ పూర్తిగా దెబ్బతినడం వల్ల రైతులపై నమ్మకం సన్నగిల్లిన మేతల కంపెనీ ఏజెంట్లు , ఫీడ్ షాపువాళ్లు అరువులు ఇవ్వ లేమని సొమ్ములు చెల్లిస్తేనే మేతలు అందించగలమని తేల్చి చెబుతున్నారు. దీంతో రైతులు తమ పంటను కాపాడు కోవడం కోసం అధిక వడ్డీలకు డబ్బులు తెచ్చుకొని మేతలు కొనుగోలు చేస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

రొయ్యల ధరలు తగ్గి రైతు నాశనమవుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఆక్వా రైతుల సంక్షేమ సంఘం పేరుతో చర్చలు జరిపినా రొయ్యల కంపెనీలదే ఇష్టారాజ్యంగా మారింది. తమకు సరుకు అవసరమైతే ఒక పది రూపాయలు పెంచుతున్నారు. ఎంపెడా కానీ, ఆక్వా అథారిటీ గానీ రొయ్య తమను పట్టించుకోకపోవడం వల్లే ఈ తిప్పలని రైతులు ఆవేదన చెందు తున్నారు.

100 కౌంట్ పట్టినా నష్టమే..

రొయ్య రైతుల పరిభాషలో చెప్పాలంటే 100 కౌంట్ పడితే ఆ చెరువు సేఫ్‌లో ఉన్నట్లేనని గతంలో అంటుంటేవారు. కానీ నేడు ఆ పరిస్థితి కానరావడం లేదు. ఒక రైతు తన చెరువులో 100 కౌంట్ రొయ్య పండించడానికి అయ్యే పెట్టుబడి వివరాలివి.. మేత 1.3 టన్నులు 1,20,000, మందులు రూ.30,000, లీజు (3 నెలలకు) 30,000, రొయ్య పిల్ల కొనుగోలు ఖర్చు రూ.35,000, రవాణా రూ.10,000, విద్యుత్ బిల్లులు (3 నెల లకు) రూ.15,000, కూలీ ఖర్చు (3నెలలకు) రూ.15,000, ఇతరాలు రూ.10,000 ఖర్చు అవుతుంది. అంటే 100 కౌంట్ రొయ్య సాగు చేయడానికి రైతుకు అయ్యే పెట్టుబడి రూ.2,65,000. ఈ లెక్కన 100 కౌంట్‌కు ఒక టన్ను రొయ్య అమ్మితే ఇప్పుడున్న ధర ప్రకారం రూ.2,05,000 వస్తుంది. ఈ లెక్కన పెట్టుబడిలోనే సుమారు రూ.50 వేల వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో రొయ్యల సాగు విస్తీర్ణం 1.75 లక్షల ఎకరాలు (జనవరి సాగు) ఉండగా దిగుబడులు 1,50,000 టన్నులు ఉంటుంది. ఇప్పుడున్న ధరల ప్రకారం తాము నష్టపోయే సొమ్ములు సుమారు రూ.7 కోట్లు ఉంటుందని రైతులు వాపోతున్నారు.



గిట్టుబాటు ధర లేదు..



రొయ్యల రైతు ఎన్నో ప్రయాసల కోర్చి పంట పండిస్తుంటే ప్రభుత్వం వారికి గిట్టుబాటు ధర కల్పించలేకపోతోంది. దీనివల్ల రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. పెట్టుబడి సొమ్ములు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.

- కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, ఆక్వా రైతు, గణపవరం

ఖర్చులు రావడం లేదు..



నేను క్రొవ్విడిలో ఐదు ఎకరాలు సాగు చేస్తున్నా. ఎంతో కష్టపడి పంట పండించినా గిట్టుబాటు ధర మాట అటుంచి ఖర్చులు రావడం లేదు. 100 కౌంట్ రూ.205లకు అమ్మితే మాకు టన్ను రొయ్యకు సుమారు రూ.50 వేలుపై చిలుకు నష్టం వస్తోంది. ఈ ప్రభుత్వ హయాంలో రొయ్యలకు గిట్టుబాటు ధర రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఖర్చులు రాకపోతే ఇక సాగు ఎలా చేయగలం.

- వాకమూడి ఇంద్రకుమార్, ఆక్వా రైతు, క్రొవ్విడి

అభ్యర్థుల్లో ఎటువంటి మార్పులు ఉండవు

» బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్

ఎమ్మెల్యే ర్యాలీని అడ్డుకున్న ఫ్లయింగ్, ఎంసీసీ టీమ్‌లు

20 మంది వలంటీర్ల రాజీనామా

5

జాతీయస్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు
ఏలూరు విద్యార్థిని ఎంపిక


రుత్వికతో స్కూలు హెచ్ఎం, కోచ్

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7 : పాండిచ్చేరిలో ఈనెల 9 నుంచి 15వరకు జరుగనున్న 38వ జాతీయ యూత్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏలూరు కస్తూరిబా మున్సిపల్ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎ.రుత్విక ఎంపికైందని స్కూలు హెచ్ఎం జి.సునీత ఓ ప్రకటనలో తెలిపారు. ఈమె గతేడాది మేనెలలో పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో జరిగిన ఆరో రాష్ట్రస్థాయి అంతర్‌జిల్లాల యూత్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని వివరించారు. బాలికకు తర్ఫీదునిచ్చిన కోచ్‌ను అభినందించారు.

11న రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు


పోటీల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీదేవి

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 7: అబ్రహం గ్యారీ కాస్పరోవ్ చెస్‌అకాడమి, ఎంకేపీజే చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన వట్లూరు సిద్ధార్థ బెస్ట్ పాఠశాలలో రాష్ట్రస్థాయి చదరం గం క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు ఏజీసీప అకాడమి డైరెక్టర్ జి.యోహానంద్ తెలిపారు. ఆదివారం ఈ పోటీలకు సంబంధించి బ్రోచర్‌ను 7వ డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ళ శ్రీదేవి ఆవిష్కరించారు. అండర్ -7, 9,11,13,15 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రచెస్ అసోసియేషన్ సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ రిఫరీగా పోశయ్య



పెంటపాడు, ఏప్రిల్ 7 : పెంటపాడు పోస్టు బేసిక్ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న ఎన్.పోశయ్య రాష్ట్రస్థాయి వాలీబాల్ రిఫరీగా ఎంపిక కావడం అభినందనీయమని పాఠశాల హెచ్ఎం నారపాటి రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేసే పోశయ్యకు వాలీబాల్ అంటే చాలా ఇష్టమని, విద్యార్థులకు విద్యాబోధన చేస్తూనే వాలీబాల్‌లో కోచింగ్ ఇచ్చేవారన్నారు. 2022లో ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా సర్వీసెస్‌లో ఆంధ్రరాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించారన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో టీవీ.రామకృష్ణ, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ కళింగ లక్ష్మణరావు, వైస్ ఛైర్మన్ సుగుణ తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

నేత్రపర్వం.. ఏకాదశ రుద్రాభిషేకం


నందివాహనంపై ఉభయదేవేరులతో శివదేవుడు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 7: క్షేత్రపాలకుడైన శివదేవుని ఆలయంలో ఆదివారం ఉదయం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశరుద్రాభిషేకం, రాత్రి జరిగిన నంది వాహనంపై తిరువీధిసేవ భక్తులను అలరించింది. లోకకల్యాణార్థం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ సేవ భక్తులకు కనువిందు చేసింది. ఆలయ గర్భాలయంలో కొలువైన శివయ్యకు అర్చకులు పండితులు వేదమంత్రోచ్చరణల నడుమ రుద్రాభిషేకాన్ని జరిపారు. రాత్రి నందివాహనంపై జరిగిన గ్రామోత్సవం చూపరులకు నేత్రపర్వమైంది. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఏలూరులో టిల్లుస్క్వేర్ చిత్ర యూనిట్ సందడి


సమావేశంలో హీరో సిద్దు, దర్శకుడు మల్లిక్‌రామ్

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 7: 2022లో విడుదలై ఘన విజయం సాధించిన డీజే టిల్లు చిత్రానికి సీక్వెల్‌గా రూపొందించిన చిత్రం టిల్లుస్క్వేర్.. సిద్ధు జొన్నలగడ్డ, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రానికి మల్లిక్‌రామ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం విడుదలై విజయవంతం కావడంతో చిత్ర యూనిట్ విజయయాత్ర చేపట్టింది. ఆదివారం ఏలూరులోని విజయలక్ష్మి థియేటర్‌లో హీరో సిద్ధు జొన్నలగడ్డ సందడి చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో హీరో మాట్లాడుతూ మంచి సబ్జెక్ట్‌గా డీజే టిల్లు స్క్వేర్ చిత్రాన్ని రూపొందించగా, మంచి స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. మరో రెండు చిత్రాలు చేస్తున్నానని, ఈసారి ఆంధ్రా స్టైల్లో తన లాంగ్వేజ్ ఉంటుందన్నారు. దర్శకుడు మల్లిక్‌రామ్ మాట్లాడుతూ ఈ చిత్రం ఇప్పటివరకు రూ.వంద కోట్లు వసూలు చేసిందని, ప్రేక్షకులతో సంతోషాన్ని పంచుకునేందుకే విజయయాత్ర చేపట్టామన్నారు. ఆదిత్య ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్ ఎల్.వి.ఆర్ ఆకర్ష్ సినిమాస్ సూరనేని ఆకర్ష్, సూరనేని రాంబాబు, థియేటర్ మేనేజరు సుబ్రహ్మణ్యం, రిప్రజెంటివ్ దాసు తదితరులు పాల్గొన్నారు.

'భకాసుర' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూనిట్ సభ్యులు

ఏలూరు కల్చరల్, ఏప్రిల్ 7: తాన్విఆర్ట్స్ కల్పనా క్రియేషన్స్ బ్యానర్లో సంయుక్తంగా నిర్మిస్తున్న తాజాచిత్రం 'భకాసుర షేర్ శివన్ హీరోగా, పల్లవి హీరోయిన్‌గా, రవికిరణ్ శర్మ, బాబూరావు, అజయ్, కిషోర్, వెంకటేష్, నాగాశ్రీ, శ్రీకిరణ్, మీరా, శిరీష, సత్య, రామాంజనేయులు, పీఎస్ రావు, రమణి, ఆయేషా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఏలూరులో ఆదివారం ఆవిష్కరించారు. డైరెక్టర్ శ్రీనివాస్ తమ్మిశెట్టి మాట్లాడుతూ దైవం, రాక్షసులు అనే విభిన్నమైన కథాంశంతో సస్పెన్స్ థ్రిల్లర్.. భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈచిత్రం రూపొందించామన్నారు. ఇప్పటికే 70 శాతం షూటింగ్ పూర్తి చేసుకుని త్వరలో మిగతా షూటింగ్‌కి సిద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో హీరో శివ, నాగప్రసాద్, హీరోయిన్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.



సన్ డే

ఎండలు @ 46

కైకరం వద్ద నిర్మానుష్యంగా వున్న హైవే

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రోజురోజుకీ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదటి వారంలో ఎండల ప్రభావం అధికంగా కనిపిస్తోంది. వృద్ధులు, పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం ఎనిమిది గంటల నుంచే వేడిగాలుల ప్రభావం కనిపిస్తోంది. మధ్యాహ్నం సమయానికి ప్రధాన పట్టణాల్లో ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

– ఏలూరు సిటీ/పాలకొల్లు అర్బన్/ఉంగుటూరు

- ఏలూరు జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత
- తీవ్రంగా వడగాడ్పులు
- ఎండ వేడిమికి తట్టుకోలేక జనం విలవిల

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే ఎండలు పెరిగాయని నివేదికలు చెబుతున్నాయి. ఆదివారం ఏలూరు జిల్లాలోని నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం తదితర ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. ఎండ వేడిమిని తట్టుకోలేక రహదారులపై ప్రయాణాలను నిలిపివేసుకుంటున్నారు.

ఉక్కపోత, వడగాడ్పులు అధికం..

ఓ వైపు భారీగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు ఉక్కపోత పెరిగింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు తట్టుకోలేకపోతున్నారు. గాలిలో తేమ శాతం పెరగడంతో ఈ పరిస్థితులు కనిపిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఉక్కపోత విపరీతంగా పెరగడంతో జిల్లాలో ఏసీలు, కూలర్లు వినియోగం పెరగంతో అనూహ్యంగా విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఎండ తీవ్రతతో పాటు తీవ్రంగా వడగాడ్పులు వీచే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు చేయాల్సి వస్తే తలకి టోపీ ధరించి లేదా రుమాలు కట్టుకుని వెళ్లాలని సూచిస్తున్నారు. మంచినీరు, మజ్జిగ, గ్లూకోజ్, నిమ్మరసం, కొబ్బరినీరు తాగాలని ఏపీ విపత్తుల సంస్థ ఇప్పటికే మెస్సేజ్‌లతో హెచ్చరికలు జారీ చేసింది.


పాలకొల్లులో రోడ్డు నిర్మానుష్యం

పెరిగిన ఉష్ణోగ్రతలు ఇలా..

ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యధికంగా 46 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉష్ణోగ్రతల వివరాలు ఇలా.. ఏలూరులో పగటి ఉష్ణోగ్రత 45 డిగ్రీలు సెంటీగ్రేడ్ ఉండగా రాత్రి ఉష్ణోగ్రత 24 డిగ్రీలుగా ఉంది. నూజివీడు, చింతలపూడిలలో 46/24, జంగారెడ్డిగూడెంలో 46/23 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదైనట్టు నెట్ సమాచారం ద్వారా తెలిసింది. ఇక భీమడోలు, పెదవేగి, ద్వారకాతిరుమల, నిడమర్రు, ఉంగుటూరు, కామవరపుకోట లింగపాలెం, కుక్కునూరు తదితర ప్రాంతాల్లో 45/24 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

శీతల పానీయాలకు డిమాండ్..

ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతుండటంతో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. జ్యూస్ షాపులు, కూల్ డ్రింక్స్ దుకాణాలు బిజీబిజీగా కనిపిస్తున్నాయి. కొబ్బరి బొండాల వినియోగం పెరిగింది. గోళీ షోడా, సుగంధి షోడా, బటర్‌మిల్క్, లస్సీ లను ఎక్కువగా సేవిస్తుండటంతో వాటికి డిమాండ్ కూడా పెరిగింది.

వడగాడ్పులకు వ్యవసాయ కూలీ మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

ఆగిరిపల్లి, ఏప్రిల్ 7: వడగాడ్పులకు ఆగిరిపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఒక వ్యవసాయ కూలీ మృతి చెందాడు. చొప్పర శ్రీనివాసరావు (45) ఆగిరిపల్లిలో గల ఒక వాహన షోరూం ఎదురుగా అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు అతనిని ఆగిరిపల్లి ప్రభుత్వాసు పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు.

చల్ల..చల్లగా..
షవర్ బాత్‌ల వద్ద సేదతీరుతున్న మూగజీవాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 7: సూర్యుడి తాపానికి చల్లదనం తోడైతే ఆ హాయి వేరుగా ఉంటుంది కదూ.. శ్రీవారి శేషాచలంపై ఎండలకు అటు భక్తులతో పాటు ఇటు దేవస్థానం సంరక్షణలో ఉన్న వందలాది మూగజీవులు సైతం అల్లాడుతున్నాయి. వేసవి తాపాన్ని తట్టుకునేలా శేషాచలంపై షవర్ బాత్‌ల వద్ద జలకాలాడుతూ ఆహా ఏమి హాయిలే ఇలా... అంటూ పూర్తిగా రిలాక్స్ అవుతున్నాయి. మూగజీవాలకు వడదెబ్బ తాకకుండా దేవస్థానం ఒక కార్యరూపం తీసుకొచ్చింది. శేషాచలంపై ఉన్న గోసంరక్షణశాలలో 320 వరకు పలు జాతుల ఆవులు. గిత్తలు, దూడలు ఉన్నాయి. ఆలయ గజలక్ష్మి(ఏనుగు), అశ్వాలను సైతం శ్రీవారి సేవలకుగాను పోషిస్తున్నారు. ఎండవేడిమి నుంచి వీటిని కాపాడేందుకు అవి నివసించే షెడ్లపైన రాజమండ్రి సమీపంలోని కడియం నర్సరీల నుంచి తెచ్చిన ఎలిఫేంట్ క్రీపర్ పాదులను పెంచి పోషిస్తున్నారు. షెడ్లలోపల భాగంలో కూల్ పెయింట్ వేసి, ఫ్యాన్‌లను ఏర్పాటుచేశారు. షవర్‌బాత్‌ల వద్ద ఆవులు, గుర్రాలు, గజలక్ష్మిలతో జల్లుస్నానం చేయిస్తున్నారు. ఖజానా బాతులకు రక్షణగా నీటి కొలనులను ఏర్పాటు చేశారు.






చల్లదనం కోసం షెడ్ పైకి ఎగబాకించిన పాదులు

షవర్ కింద జలకాలాడుతున్న గజలక్ష్మి(ఇన్‌సెట్‌లో) అశ్వం

పార్టీ అభ్యర్థుల్లో మార్పులు ఉండవు

- బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధార్థనాథ్ సింగ్

భీమవరం టౌన్, ఏప్రిల్ 7 :పార్టీ అభ్యర్థుల్లో ఎటువంటి మార్పులు ఉండవని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేస్తున్నారని, కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ రాబోతుందని మాజీ మంత్రి, బీజేపీ ఏపీ ఎన్నికల ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ అన్నారు. భీమవరం బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి జరగ లేదని, ప్యాచ్ వర్క్స్ కూడా చేయని దద్దమ్మ జగన్ ప్రభుత్వమని అన్నారు. బీజేపీ పాలనలో ఇప్పటికే వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్ర పేరుతో ఎంతోఅభివృద్ధి చేశామని, 22 లక్షల గృహాలు పేదలకు అందించామని, వీటికి జగన్ పేర్లు పెట్టుకోవడం దారుణమన్నారు. కేంద్రం తరఫున చేసే పనులకు సీఎం జగన్ మ్యాచింగ్ గ్రాంట్‌లు కూడా ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి మార్పు అంటూ గందరగోళం సృష్టించవద్దని, ఇందులో ఎటువంటి మార్పులు లేవని తానే అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు. నరసాపురం పార్లమెంట్ రెండుసార్లు బీజేపీ విజయం సాధించిందని, ఈ ఎన్నికల్లో విజయం సాధించి మూడో ఎంపీ అభ్యర్థిగా గెలుపు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి తపన చౌదరి, క్లస్టర్- కో ఇంచార్జి కోడూరి లక్ష్మీనారాయణ, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ పాక సత్యనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ పెరిచర్ల సుభాష్‌రాజు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ వాహనాలను నిలుపుదల చేయడంతో మాట్లాడుతున్న రామరాజు

ర్యాలీని అడ్డుకున్న ఫ్లయింగ్, ఎంసీసీ టీమ్‌లు

- అధికారులతో మాట్లాడిన ఉండి ఎమ్మెల్యే రామరాజు

ఆకివీడు, ఏప్రిల్ 7: టీడీపీ ర్యాలీకి అనుమతులు లేవంటూ అధికారులు అడ్డుకున్నారు. ఆదివారం భీమవరం రూరల్ గ్రామమైన పెదఅమిరం నిర్మల ఫంక్షన్ హాలు నుంచి బయలుదేరిన భారీ ర్యాలీ ఆకివీడు మండలంలోని అయి-భీమవరం వరకు సజావుగా సాగింది. అయి-భీమవరం రోడ్‌లోని మినీ బైపాస్ రోడ్‌కు వచ్చే సరికి ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ అధికారులు ర్యాలీకి అనుమతులు లేవంటూ ముందు భాగంలో ఉన్న వాహనదారులను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే రామరాజు అధికారులు దగ్గరకు వచ్చి అనుమతులు పెట్టామని తెలపారు. దీనిపై ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ అధికారి ఎంపీడీవో వై.రామకృష్ణ, ఎస్‌ఐ బత్తిన నాగబాబును ప్రశ్నించగా ర్యాలీకి అనుమతులున్నాయని ఆర్వో నుంచి తమకు సమాచారం వచ్చిందని తెలిపారు. స్థానిక ఎస్.టర్నింగ్ దగ్గర పార్టీ నాయకులు బొల్లా వెంకట్రావు, వేగేశ్న రామరాజు, పమ్ము, గొంట్లా గణపతి, కౌన్సిలర్లు బొల్లా వీరశ్వేత, మోపిదేవి సత్యవతి తదితరులు స్వాగతం పలికి ఎక్స్‌కవేటర్ ద్వారా గజమాల వేసి హారతులిచ్చారు. ర్యాలీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఉన్నారు.

క్రైం సమాచారం

వాహనం ఢీకొని యువకుడి మృతి

- మరొకరి పరిస్థితి విషమం.. విజయవాడ ఆస్పత్రిలో చికిత్స

పెదవేగి, ఏప్రిల్ 7 : లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్‌సీ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలివి.. రాట్నాలకుంటకు చెందిన తాడేపల్లి సుధీర్, తోట సురేష్ శనివారం రాత్రి ముండూరులోని బంధువుల ఇంటికి వెళ్ళి, రాత్రి తొమ్మిది గంటల సమయంలో తిరిగి వస్తున్నారు. ఎంఆర్‌సీ కాలనీ దాటిన తరువాత జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంచలనాలయమ్ ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తాడేపల్లి సుధీర్(23) అక్కడికక్కడే మృతి చెందగా, తోట సురేష్ తలకు తీవ్ర గాయం కావడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పూళ్ల కాల్వలో పడి ఒకరి మృతి

భీమడోలు, ఏప్రిల్ 7 :భీమడోలు మండలం పూళ్ళ గ్రామంలో ప్రమాదవశాత్తు ఏలూరు గోదావరి కాల్వలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రంభా ఏసు(45) ఆదివారం మధ్యాహ్నం గ్రామంలోని గోదావరి కాల్వలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు భీమడోలు పోలీసులు అగ్నిమాపక అధికారులు కాల్వలో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు ఏసు మృతదేహాన్ని వెలికితీశారు. అతడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

రైలు పట్టాలపై యువకుడి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 :ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని భీమడోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలపై గుర్తుతెలియని ఓ యువకుడు మృతి చెందాడని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ తన సిబ్బందితో ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు కల్గి, 5.5 అడుగుల ఎత్తు, సామాన్య దేహధారుడ్యం, లేత పిస్తారంగు పొడవు చేతుల చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు కల్గి ఉన్నాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే హెచ్‌సీ 80740 55378కు సమాచారం అందించాలని కోరారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

బాలిక అదృశ్యం కేసు నమోదు

పెదవేగి, ఏప్రిల్ 7 :పెదవేగి మండలం బాపిరాజుగూడెం పంచాయతీలోని ఓ గ్రామానికి చెందిన బాలిక నాలుగురోజులుగా కనిపించడంలేదని బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈనెల మూడో తేదీన సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్ళింది. తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లల్లో వెతికారు. ఆ బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

రామసింగవరంలో సారా స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 7: మండలంలోని రామసింగవరంలో 90 లీటర్ల నాటుసారా, 200లీటర్ల బెల్లం ఊట స్వాధీనం చేసుకున్నట్లు ద్వారకాతిరుమల పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


నాగిరెడ్డిగూడెంలో నాటు సారా సామగ్రితో అధికారులు

సారా తయారీ కేంద్రంపై దాడి

- 3,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం.. 50 లీటర్ల సారా స్వాధీనం

చింతలపూడి, ఏప్రిల్ 7:చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో నాటుసారా తయారీ కేంద్రంపై పోలీసులు ఆదివారం తెల్లవారుజామున దాడి జరిపారు. సారాకు తయారీకి ఉపయోగించే 3,600 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేశారు. సారా బట్టీవద్ద వున్న 50 లీటర్ల సారాను, సారా తయారీకి ఉపయోగించే పాత్రలు, ప్లాస్టిక్ డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో చింతలపూడి సీఐ సుధాకర్, ఎస్‌ఐ కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత గొడవల నేపథ్యంలో ఒకరిపై కత్తితో దాడి


గాయాలైన కర్రి దుర్గారావు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 : పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాల కు గురయ్యాడు. ఏలూరు వంగాయగూడెంకు చెందిన మున్సిపల్ వర్కర్ కర్రి దుర్గారావు, ఎలికే రాజుకు పాత గొడవలు ఉన్న నేపథ్యంలో రాజు, శ్రీలక్ష్మి అనే ఇద్దరు కలిసి కత్తితో దుర్గారావుపై ఆదివారం సాయంత్రం దాడి చేశారు. తీవ్ర గాయాలకు గురైన దుర్గారావును ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించారు.

వివాహితను వేధిస్తున్నావని ప్రశ్నిస్తే.. దాడి చేశారు

- నలుగురికి తీవ్ర గాయాలు.. రంగంలోకి దిగిన పోలీసులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 7 : ఒక వివాహితను ఎందుకు వేధిస్తున్నారంటూ అడిగిన వారిపై ఒక వర్గం దాడిచేయడంతో పలువురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఏలూరు సమీపంలోని వట్లూరు దగ్గరలో ఉన్న సీతారామ్‌పురంలో ఓ వివాహిత పొలం వెళుతుంటే అదే గ్రామానికి చెందిన నాగరాజు అసభ్యకరంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. ఇదే విషయాన్ని ఆమె తమ కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఆమె భర్త, బావ, మామ కలిసి ఆదివారం సాయంత్రం నాగరాజును ప్రశ్నించారు. పసుపులేటి రామకృష్ణ, ఏలూరుకు చెందిన మధు, మణికంఠ, నాగరాజు, దుర్గారావు, శ్రీహరి కలిసి ఆ వివాహిత కుటుంబంపై దాడికి పాల్పడగా నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఒక మహిళ చేయి విరిగిపోయింది. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. క్షతగాత్రులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్సీగా నమోదుచేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గడ్డివాము దగ్ధం

చాట్రాయి, ఏప్రిల్ 7: మండలంలోని తుమ్మగూడెం గ్రామంలో ఆదివారం రైతులు పానుగంటి మంగయ్య, సత్యనారాయణకు చెందిన ఐదు ఎకరాల్లోని గడ్డి వాములు దగ్ధమయ్యాయి. సమాచారం అందగానే విస్సన్నపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి గ్రామస్థులతో కలసి మంటలు అదుపు చేశారు. రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

స్కూళ్లను 11.30 గంటల వరకే నిర్వహించాలి

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 7: రాష్ట్రవ్యాప్తంగా గతంలో ఎన్నడూలేని విధంగా ఎండల తీవ్రత, వడగాడ్పులు అధికంగా వున్న దృష్ట్యా పాఠశాలల పనివేళలను కుదించి ఉదయం 11.30 గంటల వరకే నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు పంపిన అభ్యర్థనల వివరాలను ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం ఒంటి పూట బడులను మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించి బాలబాలికలను ఇళ్లకు పంపిస్తున్నారని, ఈ క్రమంలో పిల్లలు ఇంటికి చేరుకునే సరికి ఒంటిగంట దాటుతోందన్నారు. ఈ సమయంలో విద్యార్థులు వడగాడ్పుల బారినపడే ప్రమాదం ఉందన్న విషయాన్ని ఉన్నతాధికారులు గ్రహించాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 1,2,3 తరగతులను కిలోమీటరు పరిధిలోని హైస్కూళ్ళలో విలీనం చేయడం వల్ల సంబంధిత పిల్లలు నివాసాలకు చేరుకోవడానికి అధిక ఉష్ణోగ్రతల బారిన పడుతున్నారని వివరించారు. బాలబాలికల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో వుంచుకుని పాఠశాలల పనివేళలను కుదించేలా ఉత్తర్వులివ్వాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులు ఐక్యతగా హక్కులు సాధించుకోవాలి

- వెల్ఫేర్ ఫండ్ పథకాన్ని పునరుద్ధరించాలి : సోమసుందర్



సమావేశంలో మాట్లాడుతున్న సోమసుందర్

ఆచంట, ఏప్రిల్ 7: జర్నలిస్టులందరూ ఐక్యతగా హక్కులను సాధించుకోవాలని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు దూసనపూడి సోమసుందర్ అన్నారు. ఆదివారం మార్టేరులో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు సాయిబాబా, జక్కంశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల డిమాండ్‌లను ఆయా రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పొందుపర చాలని కోరారు. జర్నలిస్టుల వెల్ఫేర్ ఫండ్ స్కీమ్ పునరుద్ధరించాలని దీనివల్ల జర్నలిస్టులు ప్రమాదాలకు గురైతే స్కీమ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జర్నలిస్టుల సభ్యత్వ నమోదు ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి కావాలన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చేలా సంఘం తరపున పోరాడతామన్నారు. అనంతరం పలువురు సంఘ నాయకులు మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, జక్కంశెట్టి శ్రీనివాస్, నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుర్రాల శ్రీనివాస్, రవిప్రసాద్, ముత్యాల శ్రీనివాస్, తులా నాగేశ్వరరావు, దిద్దే చిరంజీవి, నాని, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు మండలంలో
20 మంది వలంటీర్ల రాజీనామా


ఎంపీడీవోకు రాజీనామా అందజేస్తున్న వలంటీర్లు

కైకలూరు, ఏప్రిల్ 7: వైసీపీ ఎన్నికల ఎత్తుగడల్లో భాగంగా వలంటీర్లతో బలవంతపు రాజీనామాలు చేయిస్తున్నట్టు తెలిసింది. కైకలూరు మండలం పెంచికలమర్రు గ్రామానికి చెందిన పది మంది వలంటీర్లు, వేమవరప్పాడుకు చెందిన తొమ్మిది మంది, తామరకొల్లుకు చెందిన ఒక వలంటీరు తమ రాజీనామా పత్రాలను స్థానిక ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అందజేశారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లను రాజీనామా చేయాలని, మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందని, మీ ఉద్యోగాలకు తాము భద్రత కల్పిస్తామని హామీలిస్తున్నారని అయితే కొంతమంది వలంటీర్లు రాజీనామా చేసేందుకు సుముఖత చూపకపోవడంతో ఆయా సర్పంచ్‌లు వారిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. రాజీనామా చేయని వారిని మళ్లీ ప్రభుత్వం రాగానే ఉద్యోగాల నుంచి తీసేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలిసింది. ఎన్నికల కమిషన్ ఈ రాజీనామాలపై దృష్టి పెట్టాలని పలువురు వలంటీర్లు కోరుతున్నారు.

రాష్ట్ర జట్టుకు నూజివీడు క్రీడాకారులు

నూజివీడు, ఏప్రిల్ 7: పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అండర్-16 విభాగం రాష్ట్ర జట్టుకు నూజివీడు విక్టోరియా టౌన్ హాల్ క్రీడాకారులు ఎంపిక అయినట్లు వీటీహెచ్ కోచ్ వాకా నాగరాజు తెలిపారు. నూజివీడుకు చెందిన వాకా రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తుండగా అమల్‌రెడ్డి, నిరంజన్ ఎంపిక అయ్యారని, బాలికల జట్టుకు బి.ప్రభుదీపిక, బి.ప్రణవి, జి.మైథిలి ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నారు.

రైతు కుటుంబానికి రూ. 50 వేలు అందజేత

చాట్రాయి, ఏప్రిల్ 7: మండలంలోని కొత్తగూడెం పాల సహకార సంఘం సభ్యుడు అలగలపల్లి కృష్ణయ్య ఇటీవల మృతి చెందగా అతని కుటుంబీకులకు ఆదివారం కృష్ణా మిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం కింద రూ. 50 వేల చెక్కును సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు అందజేశారు. తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, సంఘం అధ్యక్షుడు కొత్త రామారావు, పాడి రైతులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామికి లీలా కల్యాణం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 7 : మాస శివరాత్రి సందర్భంగా క్షీరా రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం పంచ హారతులు ఇచ్చి పూజలు నిర్వహించి, లక్షముత్యాలతో ప్రత్యేకంగా అలంక రించారు. సాయంత్రం స్వామి , అమ్మవార్లకు లీలా కళ్యాణం నిర్వహించారు.

రేపటి నుంచి ముఖదారమ్మ జాతర

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 7 : అచ్చుగట్లపాలెం (చిత్తర్వు చెర్వుగట్టు)లో ముఖదారమ్మ అమ్మవారి జాతర ఈనెల 9వ తేదీ నుంచి 15 వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. 9వ తేదీ అమ్మవారికి విశేష కుంకుమ పూజలు, రాత్రి 7 గంటలకు పుట్టింటి వారు పిన్నివారిచే అమ్మవారి జాతర ప్రారంభం, 10వ తేదీ అమ్మవారికి చలివిడి పానకాలు సమర్పణ, కుంభం వేయడం, రాత్రి జాతరలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈవిధంగా రోజూ కుంకుమ పూజలు, జాతర నిర్వహించనున్నారు. జాతర సందర్భంగా మే 3వ తేదీన అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు ఆలయ సేవా సంఘ సభ్యులు తెలిపారు.

బలుసులమ్మకు సారె సమర్పణ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 7: తాడేపల్లిగూడెం గ్రామదేవత బలుసులమ్మ వారికి ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సారె సమర్పించారు. సారె ఊరేగింపు ఆకర్షణగా నిలిచింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాంగ సంక్షేమ సంఘం అందించిన సారె, చీరలతో అలంకరించారు.

ఘనంగా జనార్దన, భోగేశ్వర కల్యాణోత్సవం



కాళ్ళ ఏప్రిల్ 7: బొండాడ గ్రామంలో శ్రీజనార్దనస్వామి, భోగే శ్వరస్వామి కల్యాణ మహోత్స వాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి స్వామిఅమ్మవార్ల కల్యాణ మహో త్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయాల ఛైర్మన్లు కోట వెంకట రామసూర్యనారాయణ, మందపాటి రాముల ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ దోనేపూడి కృష్ణ పరమాత్మ, శ్రీమాన్ వాడపల్లి రామాచార్యులను ఘనంగా సత్కరించారు. ఉండి ఏఎంసీ మాజీ ఛైర్మన్ మన్నే నాగరాజు, మన్నే శ్రీనివాస్, ఆలయ ఈవో వేగేశ్న ఆంజనేయరాజు పాల్గొన్నారు.

వెండి కవచం అందజేత



ఆకివీడు, ఏప్రిల్ 7: ఆకివీడు మాదివాడ గంగానమ్మ మద్దిరా వమ్మ దేవాలయానికి వగ్వాల సుబ్బారావు-కస్తూరిబాయి కు మారుడు శివ-ఉదయలక్ష్మి దం పతులు రూ.1.30లక్షల విలువ చేసే వెండి వినాయక కవచం మేనేజరు మోటుపల్లి సత్యనారా యణకు ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో దేవాలయ సభ్యులు మోటు పల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

యోగా, ఆహార నియమాలతో ఆరోగ్యం

ఆకివీడు, ఏప్రిల్ 7: యోగా, ఆహార నియమాలతోనే సంపూర్ణ ఆరోగ్యమని యోగాసనాచార్య కందుల సత్యనారాయణ అన్నారు. పతంజలి యోగారోగ్య కేంద్రంలో ఆదివారం ప్రత్యేక యోగా శిక్షణ, ఆహార నియమాలపై శిష్య బృం దానికి అవగాహన కల్పించి మాట్లాడారు. నేటి సమాజంలో జనం తీవ్ర ఒత్తిడి గురవుతున్నారన్నారు. దీనిని ఛేదించడానికి యోగా, ధ్యానంతో పాటు ఆహార నియమాలు చాలా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పతంజలి సెక్ర టరీ కుంకట్ల సత్యనారాయణ, గొంట్లా సత్యనారాయణ, ముదుండి శ్రీహరి రాజు, కోటికలపూడి సూర్యనారాయణ, కంభాల సత్యనారాయణ, పడాల శ్రీనివాసరెడ్డి, చొప్పెర్ల మహదేవరావు, మాటూరి అంజి పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం

భీమవరం క్రైం, ఏప్రిల్ 7 : ప్రపంచంలో ప్రాణ కోటిలో మానవ జన్మ పవి త్రమైనదని, ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ నియమ నిష్ఠలతో ఉంటే నూరేళ్ళు జీవించవచ్చునని సెయింట్ మేరిస్ ఆసుపత్రి సుపీరియర్ డాక్టర్ సిమిలీ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, సెయింట్ మేరిస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించి రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. సిమిలి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిస్టర్ అనిత్, నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడారు. అనంతరం రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు.

ముగిసిన గీతాయజ్ఞం పోటీలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 7: స్థానిక ఆనంద ఫంక్షన్ హాలులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆనంద గీతా యజ్ఞం భగవద్గీత పోటీలు ఆదివా రంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ యూ కే విశ్వనాథ రాజు, కంతేటి వెంకట రాజు, గీతా యజ్ఞం కమిటీ సభ్యులు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ఆధార్ కార్డుల సేకరణ

అత్తిలి, ఏప్రిల్ 7: అత్తిలి మండలం మంచిలి సెక్టార్ పరిధిలోని అంగన్ వాడీ కార్యకర్తలు ఆధార్ కార్డుల సేకరణలో నిమగ్నమయ్యారు. ఇంటింటికి వెళ్ళి ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు ఇవ్వాలని, లేకుంటే పథకాలు వర్తించవని చెబుతుండడంతో వివిధ గ్రామాల ప్రజలు అభ్యంతరాలను వ్యక్తం చేస్తున్నా రు. ఎన్నికల వేళ ఆధార్‌కార్డులు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆధార్ కార్డులు తీసుకుంటున్నామని చెబుతున్నారు.


విలువలతో కూడిన విద్య అందిస్తాం



మాట్లాడుతున్న నరేంద్ర కృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 7: తమ సంస్థలో విద్యార్థులకు చదు వుతోపాటు విలువ లు నేర్పుతామని అప్పుడే వారు పరిపూర్ణ విద్యార్థులుగా తయారవుతారని శశి విద్యా సంస్థల ఛైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం శశి క్యాంపస్‌లో 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు తమ సంస్థ అందించే ఐఐటీ, నీట్ కోచింగ్‌లతో భవిష్యత్‌తో మంచి ర్యాంకులు సాధించి ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతి ప్రియ, క్యాంపస్ ఇన్‌చార్జ్‌లు నిమ్మగడ్డ రాజేంద్ర ప్రసాద్, కె. జగదీష్ పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో రజతం



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 7: ఆదికవి నన్నయ్య వర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్ ఫార్మసీ విద్యార్థిని వి.న్యూరోజీ ఆలిండియా రోప్ స్కిప్పింగ్ పోటీల్లో రజత పతకం సాధించింది. భోపాల్‌లో నిర్వహించిన పోటీల్లో పతకం సాదించినట్టు ప్రిన్సిపల్ టి అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా రోజీకి అభినందనలు తెలిపారు.

మహదేవపట్నంలో శివ ప్రచారం



గడ్డి మోపు మోస్తూ శివ ప్రచారం

ఉండి, ఏప్రిల్ 7:తనను మీబిడ్డగా ఆశీర్వదించి గెలిపించా లంటూ స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివ రామరాజు ప్రజలను కోరారు. ఆదివారం మహదేవపట్నంలో ఆయన ఆటోపై ప్రచారం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు తనను రెండు మార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, దాంతో ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాల్లో ఎన్నో సంక్షేమ అభివృద్ధి పనులను చేశానన్నారు. మరోసారి తనను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉండి మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివ రాజు, పార్టీనాయకులు మోపిదేవి నాగ శ్రీనివాసరావు, బురిడి రవిబాబు, వేగేశ్న మహేష్‌బాబు, దవిళి శ్రీనివాస్, వేగేశ్న అనంతలక్ష్మీ, వత్సవాయి సుజాత తదితరులు పాల్గొన్నారు. ఉండి గోరింతోటలో పల్లెనిద్ర చేశారు.






పెదఅమిరంలో ప్రసంగిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, చిత్రంలో ఉండి టీడీపీ అభ్యర్థి రామరాజు.. తణుకు టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరిక.. కట్టుపాలెంలో పాలకొల్లు టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు ప్రచారం.. భీమవరంలో జనసేన, బీజేపీ, టీడీపీ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నాయకులు

జగన్ బ్యాచ్‌ను సాగనంపుదాం: అంజిబాబు



జనసేనలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బొలిశెట్టి

భీమవరం టౌన్, ఏప్రిల్ 7 : నెలరోజుల్లో జగన్ బ్యాచ్ ని ఇంటికి పంపించేద్దామని, వారికి నెలరోజులే గడువు అని జనసేన కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం అల్లూరి సీతారామరాజు కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన జనసేన, టీడీపీ, బీజేపీ ఆత్మీయ సమావేశంలో ఆయనమాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే జనసేన, టీడీపీ నాయకులపై పెట్టిన కేసులను ఎత్తి వేస్తామని హామీ ఇచ్చారు. ఎవరిని వదలమని, అందరికీ నెలరోజుల తరువాత గుణపాఠం చెబుతామని, ఎవరు భయపడవద్దని, అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతా రామలక్ష్మి మాట్లాడుతూ రానున్నది ఉ మ్మడి ప్రభుత్వమే నని, మనకు మంచిరోజులు వస్తాయని అన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి భూప తిరాజు శ్రీనివాస్ వర్మ, జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు, జనసే న పార్టీ రాష్ట్ర నాయకులు వేగేశ్న కనకరాజు సూరి, పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్ర శేఖర్, బీజేపీ క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ పాకా సత్యనారాయణ, యిర్రింకి సూర్యారావు, ఇందుకూరి రామలింగరాజు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి.. ఎమ్మెల్యే రామరాజు

కాళ్ళ, ఏప్రిల్ 7 : ఉండి ఎమ్మెల్యేగా ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మంతెన రామరాజు కోరారు. పెదఅమిరం గ్రామం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణు లతో కలిసి ఆదివారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు హాజరయ్యారు. పెదఅమిరంలోని నిర్మలాదేవి ఫంక్షన్ హాల్‌లో తొలుత నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మీ నాయకులు కార్యకర్తలతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రామరాజు మాట్లాడుతూ 2019లో రాష్ట్రమంతా వైసీపీ గాలి వీచినా టీడీపీ కార్యకర్తల అండదండలు, ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. నాటి నుంచి రాత్రి, పగలు తేడా లేకుండా కష్టపడి నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీర్చడానికి కృషి చేశానన్నారు. ఉండి సీటు వేరే అభ్యర్థికి మారుస్తు న్నారంటూ ఇటీవల మీడియాలో వచ్చిన కథనాలు చూసి కార్యకర్తలు అపోహలకు గురవుతున్నారని, తనకు చంద్ర బాబు నాయుడుపై ప్రగాఢ నమ్మకం ఉందని ఎవరు ఆందోళనకు గురి కావద్దని సూచనలు ఇచ్చారు. అనంతరం పెదఅమిరం నుంచి మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్/ఉండి: ఉండిని యోజకవర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామరాజుకు మండలంలోని చెరుకుమిల్లి, అయిభీమవరం, అజ్జమూరు గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. జనసేన, టీడీపీల ఆధ్వర్యంలో కాళ్ళమండలం పెదఅమిరంలో బయలు దేరి, ఏలూరుపాడు మీదుగా ఆకివీడు మండలం చెరుకుమిల్లి మీదుగా ఆకివీడు మండలంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఉండిలో ర్యాలీ ముగించారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుగా నాగరాజు ఉన్నారు. బొర్రా రాంబాబు, బొర్రా సుజాత, నగేష్‌రాజు, కనుమూరు రామకృష్ణంరాజు, మురళీరాజు, బుజ్జిరాజు, అప్పలరాజు, నౌకట్ల రామారావు, సోమరాజు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

తణుకు, ఏప్రిల్ 7: జగన్ విధానాలతో ప్రజలు విసుగు చెందారని తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఇరగవరం మండలం అర్జునుడు పాలేనికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆరిమిల్లి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ నాయకులు గోపిశెట్టి రామకృష్ణ, అర్జునుడుపాలెం సర్పంచ్ పోతుల గంగాధర్, సత్తి కృష్ణారెడ్డి, కర్రి బ్రహ్మారెడ్డి, కర్రి జనార్దన్ రెడ్డి, సత్తి చల్లారెడ్డి, వార్డు సభ్యులు సత్తి వెంకట సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: ఓడూరు గ్రామంలో 30 మంది దళితులు టీడీపీ కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో దళితులు చేరారు. జగన్ రెడ్డి ప్రభుత్వం 27 సంక్షేమ పథకాలను రద్దుచేసిందని, దళితులను మోసగించిందని పితాని పేర్కొన్నారు.

పింఛన్ల పేరిట మోసం: కృష్ణ తులసి

తణుకు, ఏప్రిల్ 7: పింఛన్ల పేరుతో వైసీపీ పెద్దలు ప్రజలను మోసగిస్తున్నారని తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. ఆదివారం పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరెంటు బిల్లు, సొంతిల్లు వంటి కారణాలతో పింఛన్లు తొలగిస్తున్నారన్నారు. పింఛన్లను ఎన్టీ రామారావు ప్రవేశ పెట్టారని, తర్వాత కాలంలో వాటిని పెంచిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బసవా రామకృష్ణ, కొమ్మిరెడ్డి ప్రభాకర్, రెడ్డి నరసింహారావు, మాదాసు రాంబాబు, రంగరాజు, మధులత, చుండూరి శేషాద్రి, ఇందిరాదేవి, రమాదేవి, సత్యవాణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

కట్టుపాలెంలో ఎమ్మెల్యే నిమ్మల ప్రచారం

యలమంచిలి, ఏప్రిల్ 7: అధికారం చేపట్టబోయే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చే జూలై ఒకటో తేదీన పెన్షన్ సొమ్ము పెరిగిన నాలుగువేలతో పాటు ఈ మూడునెలల కాలానికి పెంచిన మొత్తం మూడువేలు కలిపి ఏడువేలు అందుకుంటారని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. కట్టుపాలెం గ్రామంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏకష్టం వచ్చినా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవకుడిగా పనిచేసే తనను మరోసారి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. గ్రామంలో సమస్యలన్నింటినీ తీర్చే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీఎం జగన్ అసమర్థత వల్లే సామాజిక పెన్షన్లను ఇంటింటికీ పంపిణీ చేయలేకపోయారని విమర్శించారు.

జనసేనలో ఎమ్మార్పీఎస్ నాయకుల చేరిక



పితాని సమక్షంలో టీడీపీలో చేరిక

నరసాపురం టౌన్, ఏప్రిల్ 7: జనసేన పార్టీలోకి ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు తెన్నేటి సురేష్, జేమ్స్‌రాజు, ఏసుబాబు, బాలం శ్రీను, సుందర్‌సింగ్, శేఖర్,చిట్టిబాబు, లావణ్యకుమార్, రంగారావు, నాగేంద్ర చేరారు. పార్టీ కార్యాలయంలో చేరిన వీరందరికీ కన్వీనర్ బొమ్మిడి నాయకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని 17, 18, 19 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

తాడేపల్లిగూడెం అర్బన్: నా ఎస్సీలు అంటూనే వారిని వెన్నుపోటు పొడిచిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలి శెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కా ర్యాలయంలో రాకూరి గణేష్, తాడేపల్లి కిషోర్‌ల ఆధ్వర్యంలో పలువురు జనసేనలో చేరగా బొలిశెట్టి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపాలి

గణపవరం, ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని, ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని ఉంగుటూరు జనసేన ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు సోదరుడు భీమరాజు అన్నారు. ఆదివారం కోమర్రులో ధర్మరాజుకు మద్దతుగా జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ గణపవరం మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, జిల్లా శాలివాహక ఉపాధ్యక్షుడు భీమవరపు ఏసురాజు, బలుసు శ్రీనివాస్, జనసేన మండల నాయకుడు తోట శ్రీనివాసరావు, చినరత్తయ్య, వడ్డి సుబ్బరాజు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, ఏప్రిల్ 7: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా నిర్వహించే వైద్య సేవలను ఆదివారం డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్ర అందించారు. తణుకు పట్టణం, పాతూరు, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి వృద్ధులకు సేవలందించారు. వేల్పూరుకు చెందిన కోరా సత్యనారాయణమూర్తి ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందించారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

ఫార్వర్డ్‌బ్లాక్‌కు ఏ పార్టీతో పొత్తులు లేవు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 7: ఆలిండియా ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీకి ఏపార్టీతోను పొత్తులు లేవని, రాష్ట్ర వ్యాప్తంగా స్వతంత్రంగా పోటీచేస్తున్నట్టు పార్టీ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి తెలిపారు. భీమవరంలో ఆదివారం పార్టీ కార్యాయ లంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమవరం అసెంబ్లీ అభ్యర్థిగా దండు శ్రీనివాసరాజును ఏకగ్రీవంగా సమావేశం నిర్ణయిం చిందన్నారు.

పీఎంపీలకు వైద్య విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ కే.సురేఖ

గణపవరం, ఏప్రిల్ 7: వైద్యరంగం ఆధునిక వసతు లతో ముందుకు సాగుతోందని ప్రముఖ స్త్రీల వైద్య నిపుణు రాలు డాక్టర్ కె.సురేఖ అన్నారు. ఆదివారం సరిపల్లె లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో గణపవరం, నిడమర్రు మండలాల పీఎంపీల అసోసియేషన్, తాడేపల్లిగూడెం లలితా హాస్పటల్ వైద్యనిపుణుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీఎంపీలకు వైద్యవిజ్ఞాన అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ, మరో వైద్య నిపుణుడు కె.సాయిపృథ్వీ పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు మాట్లాడారు.

సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు కల్పనకుమారి ఎంపిక



నరసాపురం, ఏప్రిల్ 7: సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు నరసాపురం పట్టణానికి చెందిన ఎస్.కల్పనకుమారి ఎంపికయ్యారు. ఎంఫార్మా పూర్తి చేసిన కల్పనకుమారి రెండేళ్ళ క్రితం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు రాత పరీక్ష రాశారు అందులో ఆమె ఎంపికయ్యారు. ఢిల్లీలో శిక్షణకు హాజరుకావాలని ఉత్తర్వులు అందాయి. తిరుపతిలో విద్యాభ్యాసం చేశారు. ఆమె భర్త ప్రభుత్వ డెంటల్ వైద్యులు డాక్టర్ రాంబాబు. ఆంధ్రాలో సెంట్రల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఒక్క విశాఖలోనే ఉంది.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలి: ఎంఈవో



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

పెంటపాడు, ఏప్రిల్ 7: విద్యార్థులు చదు వుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈవో టీవీ రామ కృష్ణ అన్నారు. పెంట పాడు రవితేజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో యానివర్సరీ డే అధినేత రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడుకు బాబ్జి పరామర్శ



తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 7: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడి మాతృ మూర్తి కళావతమ్మ ఇటీవల చనిపోవడంతో శ్రీకాకుళం జిల్లాలోని అచ్చెన్నాయుడి ఇంటికి వెళ్లి ఆయనను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పరామర్శించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కూటమి గెలుపుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని అచ్చెన్నాయుడు సూచించినట్లు బాబ్జి తెలి పారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పోతుల అన్నవరం, గంధం సతీష్ త దితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి మంచాలు అందజేత

భీమవరం టౌన్, ఏప్రిల్ 7: జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో వీరమ్మ చెరు వు గట్టు వద్ద ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంకు దాతల సహకారంతో 3 మంచలను (రూ 15వేలు విలువ) అందించారు. వృద్ధుల ఆశ్రమం నిర్వాహకులు కొక్కండ వీర బ్రహ్మం, నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి, అరసవల్లి చారిటాబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, చాన్ బాషా పాల్గొన్నారు.